# సేవయే మానవుని ప్రధాన కర్తవ్యం

**ప్రేమస్వరూపులారా!** వ్యష్టి మొదటి శక్తి, సమష్టి రెండవ శక్తి, సృష్టి మూడవ శక్తి, పరమేష్ఠియే నాల్గవ శక్తి. అదే బ్రహ్మ. బ్రహ్మనుండి సృష్టి ఆవిర్భవించింది. సృష్టినుండి సమష్టి ఏర్పడింది. సమష్టినుండి వ్యష్టి వచ్చింది. కాబట్టి, వ్యష్టి సమాజానికి సేవ చేయాలి. సేవయే మానవుని ప్రధానమైన కర్తవ్యం. ప్రపంచములో పశుపక్ష్యాదులు, క్రిమికీటకాదులు ఏ సుఖసంతోషాలను అనుభవిస్తున్నాయో మానవుడుకూడా అవే సుఖసంతోషాలను అనుభవిస్తున్నాడు. ఇక, తాను మానవునిగా పుట్టి ప్రయోజనమేమిటి? ప్రతి మానవుడు సమాజసేవ చేయాలి. ఎవరికోసం? సమాజంకోసమే. సమాజం ఎవరి కోసం? జగత్తుకోసం. ఈ సృష్టి అంతయు భగవత్స్వరూపమే. అందువల్లనే, 'మమైవాంశో జీవలోకే జీవ భూతస్సనాతనః', 'ప్రతి వ్యక్తీ, ప్రతి జీవికూడను నా అంశమే', అన్నాడు, కృష్ణుడు. ప్రతి జీవికూడను దైవాంశమే కాబట్టి మనం ప్రతి జీవిని పూజించాలి, గౌరవించాలి, ఆనందింపజేయాలి. మనం ఎవ్వరినీ ద్వేషించకూడదు, దూరం చేసుకోకూడదు. మన దేహంలో చేతులు, భుజములు, కడుపు, కాళ్ళు ... ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి పని చేస్తున్నాయి. ఈ అన్ని అంగములూ ఒకే దేహానికి సంబంధించినవి. అదేరీతిగా, అన్ని జీవులుకూడను ఒకే దైవముయొక్క వివిధ అంగములే. కాలొకచోట ఉంది, కన్ను మరోచోట ఉంది. అయినా కాలికి దెబ్బ తగిలితే కన్ను ఏడుస్తుంది. కంటికి, కాలికి మధ్య ఏవిధమైన సన్నిహిత సంబంధమున్నదో దైవానికి, ప్రాణులకుమధ్య ఆవిధమైన సన్నిహిత సంబంధమున్నది. ఐతే, 'దైవము మాకు కష్టముల నిస్తున్నాడే, బాధలు కలిగిస్తున్నాడే, దుఃఖము సందిస్తున్నాడే', అని మీరు భావించ వచ్చు. ఇవన్నీ మీరు చేసుకున్న కర్మల ఫలితములే తప్ప దైవమందించినవి కావు. దైవము ఆనందస్వరూపుడు,

sri sathyasaivachanamrutam

అమృతస్వరూపుడు. తాను ఎవ్వరికీ ఎట్టి కష్టముగాని, ఎట్టి బాధలు గాని ఇవ్వడు. కాబట్టి, 'దైవము మాకీ కష్టాల నిచ్చాడే', అని అనుకోవడం చాలా పొరపాటు.

**ఎవరు చేసిన కర్మ వారనుభవింపక**
**ఏరికైనను తప్పదన్నా!**
**ఏనాడొ ఏ తీరొ ఎవరు చెప్పాగలరు!**
**అనుభవించుట సిద్ధమన్నా!**

మనము చేసుకున్న కర్మలే మనకు సుఖదుఃఖాలుగా రూపొందుతున్నవి. పరులు నీకేదో అపకారం చేస్తున్నారని భావించడం చాలా పొరపాటు. ప్రతి ఒక్కటీ నీవు చేసిన కర్మలయొక్క రిప్లెక్షనే, రియాక్షనే, రీసౌండే! మానవుడు తాను అనుభవించే సుఖదుఃఖాలకు తానే బాధ్యుడు.

ఈనాడు జగత్తును సరిచేయవలెనన్నను, రక్షించవలెనన్నను యువతీ యువకులే అందుకు తగిన సమర్థులు. యువత లేకుండిన దేశమే నిలువదు. కాని, 'మాకు తెలిసినంతగా ఈ యువకుల కేమి తెలుసు! వాళ్ళు అనుభవం లేని పిల్లలు', అని పెద్దలు భావిస్తున్నారు. ఈవిధంగా భావించడం చాలా పొరపాటు. యువకులు తలుచుకుంటే ఏమైనను సాధించగలరు. నరకమునుకూడా స్వర్గంగా మార్చగలరు. యువకులందున్న శక్తి మహత్తరమైనది. తమలో ఉన్న శక్తిని తాము అర్థం చేసుకోగలిగితే తమంతట తామే దేశాన్ని ఉద్ధరించగలరు. దీనికి చదువు సంధ్యలు అక్కరలేదు. ఏమిటీ చదువులు?! ఆత్మజ్ఞానమే నిజమైన విద్య. ఈనాడు చదువంటే గ్రంథపరిచయమని భావిస్తున్నారు.

**చదివి వ్రాయ నేర్చినవారంతా విద్యావంతులేనా!**
**కాలేజీ డిగ్రీలను పొంద విద్యావంతులగునా!**
**సుజ్ఞానము సుకృతి లేని విద్యలు సద్విద్యలగునా!**
**బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకలేవె పశు పక్షులు!**

సుజ్ఞానము లేని విద్యలు విద్యలే కావు. అవి కేవలం లౌకికమైన విద్యలు. ఇట్టి విద్య నేర్చే

sri sathyasai vahini amrutam

నిమిత్తమై ఈనాటి యువకులు విదేశాలకు బయల్దేరుతున్నారు. 'ఎన్న భారతే తన్న భారత', భారతదేశంలో లేని విద్యలు ఏ దేశంలోనూ లేవు. కాని, విదేశాలకు పోయి డిగ్రీలు తీసుకు వస్తే అటువంటివారు చాలా గొప్పవారని భావిస్తున్నారు. విదేశాలకు వెళ్ళేవారిలో చాలామంది దుర్విద్యలు, దురభ్యాసాలు నేర్చుకొని వస్తున్నారేగాని, సద్విద్యలు, సదభ్యాసములు నేర్చుకొని రావడం లేదు.

**నేర్చిన విద్యను దైవార్పిత భావంతో ఆచరణలో పెట్టాలి**

భారతీయ విద్య ఎంతో పవిత్రమైనది. భారతీయులు మొట్టమొదట భగవంతుని స్మరించిన తరువాతనే ఏ పనైనా ప్రారంభిస్తారు. నిరక్షరాస్యుడైన లారీ డ్రైవరుకూడా స్టీరింగు పట్టుకునే ముందు దానికి నమస్కారం చేస్తాడు. హార్మోనియం వాయించే కళాకారుడు మొట్టమొదట హార్మోనియంకు నమస్కారం చేసిన తరువాతనే శ్రుతి పెడతాడు. ఈవిధంగా, భారతీయులు ఏ విద్యలు నేర్చినప్పటికీ దైవార్పిత భావంతో వాటిని ఆచరణలో పెడతారు. ఇతర దేశస్థులు చేసేవి 'ఆర్టిఫీషియల్' (కృత్రిమం)గా ఉంటాయి. వాళ్ళు ఏమి చేసినా కేవలం బాహ్యమైన, భౌతికమైన 'షో' (ప్రదర్శన) కోసం చేస్తుంటారు. ఈనాడు అనేకమంది విదేశాలకు వెళ్ళి పెద్ద డిగ్రీలు తెచ్చుకుంటున్నారు. కాని, వారు నేర్చిన విద్యయొక్క పరమార్థమేమిటో వారికే అర్థం కావడంలేదు. నిజంగా భారతీయ విద్యార్థులు చాలా పవిత్రమైన హృదయం గలవారు. భారతీయ విద్యార్థులను చూస్తే నాకెంతో ఆనందం కలుగుతుంది. వారి ముఖమునందు నిజమైన విద్యావంతుల కళ తాండవమాడుతుంటుంది. పవిత్రమైన భారతీయ విద్యను విస్మరించి కేవలం భౌతికమైన విద్యను నేర్చుకోవడం చాలా పొరపాటు.

కేలిక్యులేటర్లు, కంప్యూటర్లు మొదలైన యంత్రముల చేత సాధించలేనిది మంత్రముచేత సాధించవచ్చును. భగవన్నామమనే మంత్రముచేత మనం నిత్యసత్యమైన ఆనందాన్ని అనుభవించవచ్చును. కాని, మానవుడు భ్రాంతిలో పడి ఇట్టి సత్యాన్ని గుర్తించలేకపోతున్నాడు. పవిత్రమైన భారతీయ హృదయాన్ని మరచిపోయి, భౌతికమైన, లౌకికమైన, తాత్కాలికమైన ఫలితాలను ఆశించి ప్రపంచమంతా పాడైపోతున్నది. మన

srisathyasaivachanamrutam

ప్రభుత్వమువారు కూడా భారత దేశములో కేవలం భౌతిక విద్యలను అభివృద్ధిపరచాలని ఆశిస్తున్నారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' గురించి మాట్లాడుతున్నారు. కాని, టెక్నాలజీ ఏమీ లేదు; అంతా ట్రిక్ నాలెడ్జి! చెప్పేది టెక్నాలజీ, చేసేది 'ట్రిక్'నాలజీ! ఇతరులకు అన్యాయం చేయడం, మోసం చేయడం... ఈవిధమైన 'బిజినెస్'లో మునిగారు, భారతీయులు. పవిత్రమైన భారతదేశంలో పుట్టి మనం ఈవిధమైన దుర్మార్గంలో ప్రవేశించ కూడదు. హృదయంలో భగవత్ భావమును నింపుకోవాలి. సర్వకర్మలను భగవత్ ప్రీత్యర్థంగా, భగవత్ప్రార్థనతో ఆచరించాలి. అప్పుడే దివ్యమైన, భవ్యమైన ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. కాని, ఈనాడు ఏ పని చేసినా స్వలాభాపేక్షతో చేస్తున్నారు. ఒక సంగీత విద్వాంసునివద్దకు వెళ్ళి, 'అయ్యా! మా ఇంట్లో పూజ జరుగుతున్నది. వచ్చి మంగళహారతి పాట పాడతారా?' అని అడిగితే, 'ఎంతిస్తావు?' అని అడుగుతారు. ఈనాడు తిండి తీర్థాదుల విషయంలో కూడా వ్యాపారం చేస్తున్నారు. మన పవిత్ర భారతదేశము 'అన్నపూర్ణ క్షేత్రము'గా పేరుగాంచినది. అడిగినవారికి లేదనకుండా అన్నం పెట్టడం, దప్పిగొన్న వారి దాహం తీర్చడం భారతీయుల సంప్రదాయం. అటువంటి పవిత్ర సంప్రదాయాన్ని విస్మరించి, విదేశీ 'ఫ్యాషన్ల' మోజులో పడి భారతీయ సంస్కృతి పేరునే పాడుచేసిపెడుతున్నారు. భారతీయ సంస్కృతి చాలా గొప్పది. అన్ని దేశముల కంటే భారతదేశము చాలా పవిత్రమైనది. భారతదేశములో పుట్టిన మీరు భారతీయులుగా జీవించాలి.

**సత్యధర్మములే మన నిజమైన సంపద**

సతీ సక్కుబాయి ఎంతటి గొప్ప భక్తురాలు! భగవంతునికోసం ఆమె తన సర్వస్వాన్ని త్యాగం చేసింది. ఇట్టి త్యాగమూర్తులకు జన్మనిచ్చిన భారత దేశములో ఈనాడు మనం భోగము అనుభవించాలని కోరుతున్నాము. కనుకనే, దేశము ఇన్ని కష్టములకు గురి అవుతున్నది. మనకు భోగము అక్కర్లేదు; త్యాగం అత్యవసరం. ఈనాడు పెద్దలుకూడను పిల్లలను విదేశాలకు వెళ్ళవలసిందిగా ప్రోత్సహిస్తున్నారు. ఇక, డబ్బున్నవారి సంగతి చెప్పనక్కర్లేదు; చిన్నతనంలోనే పిల్లలను విదేశాలకు పంపుతున్నారు. ఈ దుర్మార్గాని కంతటికీ మూలకారణం మితిమీరిన డబ్బే! Money makes many wrongs.

srisathyasaivahamrutam

మితిమీరిన డబ్బు చెడ్డ మార్గానికి త్రిప్పుతుంది. Money comes and goes, morality comes and grows. కాబట్టి, నీతి నియమాలను మనము పోషించుకోవాలి. భారతీయ సంస్కృతికి మూలాధారమైన సత్య, ధర్మములను జగత్తులో వ్యాప్తి గావించాలి. సత్యధర్మములే మన నిజమైన సంపద. సత్యధర్మములను మన ప్రాణసమానంగా భావించాలి. ముఖ్యంగా యువకులు సత్యమును ప్రచారం చేయటానికి పూనుకోవాలి. సత్యమనగా ఏమిటి? తలంపు, మాట, క్రియ – మూడూ ఒక్కటి కావాలి. అప్పుడే సత్యము నిలుస్తుంది. ఈనాడు వేదికలపై నిలబడి ఒకటి చెబుతున్నారు; మనసులో ఇంకొకటి పెట్టుకుంటున్నారు; బయట మరొకటి చేస్తున్నారు. ఇది మహాపాపం!

**డబ్బును నమ్ముకోవద్దు, ప్రేమను నమ్ముకుందాం**

ప్రేమస్వరూపులారా! మీ స్వరూపము ప్రేమయే. ప్రేమయే ఈ ప్రపంచాన్ని కాపాడుతూ వస్తుండాది. పంచభూతములలో అంతర్భూతంగా ఉన్న దివ్యశక్తి ప్రేమయే. అట్టి పవిత్రమైన ప్రేమను ఈనాడు డబ్బుకు అమ్ముకుంటున్నారు. డబ్బును నమ్ముకుంటే మనకు కలిగే ప్రయోజనమేమీ లేదు. ప్రేమను నమ్ముకుందాం. ప్రేమకు ప్రతిఫలము ప్రేమయే. ఇదే మనము కోరవలసింది. అప్పుడే మనలో ప్రేమ అభివృద్ధి అవుతుంది; ప్రతి ఒక్కరినీ మనం ప్రేమించగల్గుతాము. 'వీరు నావారు, వారు పరాయివారు' అనే భేదభావాన్ని విడిచిపెట్టాలి. 'అందరూ నావారే. నేను అందరివాడనే. అందరం ఒకే తల్లి బిడ్డలమే', అనే విశాలమైన భావాన్ని అలవరచుకోవాలి. అందరినీ అన్న దమ్ములుగా, అక్క చెల్లెళ్ళుగా భావించి ప్రేమించాలి. అప్పుడప్పుడు కొన్నికొన్ని విభేదాలు తలెత్తవచ్చును. అవి వస్తాయి, పోతాయి. వాటిని పట్టించుకోకూడదు. శాశ్వతంగా ఉండేటటువంటిది ప్రేమ ఒక్కటే. ప్రేమచేత అందరూ కలిసిమెలిసి మెలగాలి. కేవలం చదువులు ముఖ్యం కాదు; సంపాదన ముఖ్యం కాదు. ఎంతమంది కోటీశ్వరులు లేరీ జగత్తులో! వాళ్ళంతా పోయేటప్పుడు తమవెంట ఏమి తీసికొనిపోతున్నారు! ఏమీ లేదు.

**నిరత సత్య ప్రౌఢి ధరణి నేలిన హరి**
**శ్చంద్రుడీ ధర బాసి చనగలేదె**

srisathyasaivachanamrutam

ఎల్ల లోకము లేలి ఎసగు శ్రీ నలరాజు
తన వెంట భూమిని గొనుచు చనెనె
కృతయుగంబు నలంకృతిని చేయు మాంధాత
సిరి మూట గట్టుగ అరిగినాడె
జలధి సేతువు గట్టె అలనాటి శ్రీరాము
దుర్విపై యిప్పుడు ఉన్నవాడె
ఎందరెందరు రాజులు ఏగినారో
ఒక్కరును వెంట గొనిపోరు ఉర్వితలము
నీవు మాత్రము రాజ్యంబు భోగములను
తలను కట్టుకపోదువా ధర్మహృదయ

అలెగ్జాండర్ అనేక దేశాలను జయిస్తూ భారతదేశంపైకి దండెత్తి వచ్చాడు. ఇక్కడికి వచ్చిన తరువాత అతనికి గుండెపోటు వచ్చింది. తనకు అంత్యకాలం ఆసన్న మైనదని గ్రహించి మంత్రులను సమావేశపరచాడు. తాను మరణించిన తరువాత తన దేహాన్ని స్వదేశానికి తీసుకువెళ్లి, దానిని బట్టతో చుట్టి చేతులు మాత్రం పైకి పెట్టి వీధివీధిలోనూ ఊరేగించవలసిందిగా వారిని కోరాడు. 'అలెగ్జాండర్ అనేక దేశాలను జయించాడు; ఎంతో ధనం సంపాదించాడు. కాని, కట్టకడపటికి వట్టి చేతులతోనే వెళ్ళాడని ప్రజలకు తెలియాలి', అన్నాడు.

**వ్యక్తిని ప్రేమించాలి, దైవాన్ని విశ్వసించాలి**

ఎన్ని కోట్లు సంపాదించినప్పటికీ మానవుడు చిట్టచివరికి వట్టి చేతులతో పోవలసినటువంటివాడే! కాబట్టి, ఉన్నంతలో దానధర్మములు చేసి పరులను సంతోషపెట్టాలి. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః'. బీదసాదలకు చేయూత నందించాలి. రోగులకు తగిన సహాయం చేయాలి. సంపాదించిన ధనమును ఈవిధంగా సద్వినియోగం చేయాలి. 'సమాజ సేవయే నా కర్తవ్యం' అని భావించాలి. సమాజ సేవ చేయనివాడు నిజంగా దుర్మార్గుడే! సంఘసేవలో పాల్గొనేవాడు సన్మార్గుడు.

sri sathyasai vachanamrutam

నీకు ఎదురయినవాడు నిన్ను ద్వేషించేవాడైనా సరే, అతనికి నీవు ప్రేమతో నమస్కరించు. 'వాడు నా శత్రువు' అనే తిరస్కార భావంతో నీవు నమస్కారం చేయకుండా ఉండకూడదు. నీ నమస్కారం అతను తీసుకున్నప్పుడు నీకూ తన నమస్కారం అందిస్తాడు. అందరుకూడను మనకు మిత్రులే! లోకములో మనకు శత్రువులే లేరు. శత్రుత్వము చాలా చెడ్డది. మిత్రత్వమే మనము కోరవలసింది. 'నీవు, నేను ఒక్కటే' అనే ఏకత్వ భావాన్ని అభివృద్ధిపరచుకోవాలి. దైవదర్శనం కావాలనుకుంటే మొట్టమొదట నీకు కనిపించిన ప్రతి వ్యక్తిని నీవు దైవంగా భావించు. 'హలో బ్రదర్' అని ప్రేమతో పలుకరించు. ఈనాడు పైకి hello అని పలుకరిస్తారుగాని, హృదయంలోపల చూస్తే hallow (శూన్యం)గా ఉంటున్నది. ప్రతి వ్యక్తిని మనము ప్రేమించాలి. దైవాన్ని విశ్వసించాలి. దైవంపై విశ్వాసం లేనివాడు మానవుడే కాదు. దైవవిశ్వాసమే మన శ్వాసగా భావించాలి. దైవవిశ్వాసమును నిలబెట్టు కున్నప్పుడే ప్రేమను నిలబెట్టుకున్నవారమవుతాము.

**అనుమానం ప్రాణ సంకటం**

ప్రేమస్వరూపులారా! పుట్టినప్పుడు మనవెంట వచ్చినది ప్రేమ ఒక్కటే. ప్రేమ ఉన్నచోట సత్యము ఆవిర్భవిస్తుంది. సత్యము, ప్రేమ రెండూ చేరినప్పుడే మానవత్వము జీవిస్తుంది. పునాది లేకపోతే మనము గోడలు నిర్మించలేము. ఆత్మవిశ్వాసమే పునాది. ఆత్మ సంతృప్తియే గోడలు. స్వార్థత్యాగమే roof (పైకప్పు). ఆత్మసాక్షాత్కారమే life (జీవితం). కాబట్టి, ఆత్మసాక్షాత్కారం కావాలనుకుంటే ఆత్మవిశ్వాసం ఉండాలి. ఆత్మవిశ్వాసం లేకుండా మీరు ఆనందాన్ని పొందలేరు. ఈనాటి మానవునికి అన్నింటిపైనా అనుమానమే! అనుమానమే! తనను తాను నమ్మలేనటువంటివాడు దైవాన్ని ఏవిధంగా నమ్మగలడు! మొట్టమొదట తనను తాను నమ్మాలి. 'అనుమానం ప్రాణసంకటం' అన్నారు. అనుమానంతో పీడింపబడేవాడు ఎవరినీ విశ్వసించ లేడు. చివరికి, తన భార్యాబిడ్డలను సహితం తాను నమ్మలేడు. కాబట్టి, మొట్టమొదట ఆత్మవిశ్వాసమును పోషించుకోవాలి.

**'జంతూనాం నరజన్మ దుర్లభం'**

మనం చాలా పెద్దవారమనుకుంటున్నాము; గొప్ప చదువరుల మనుకుంటున్నాము.

sri sathyasaivachanamrutam

ఏమిటీ చదువులు! తగినరీతిగా తర్ఫీదు ఇస్తే ఏనుగుకూడా ఎక్సర్‌సైజులు చేస్తుంది; కోతికూడా సైకిలు త్రొక్కుతుంది. మనిషి చేసే పనులు జంతువులుకూడా చేయగల్గుతున్నాయి. 'మానవుడు' అని పేరు పెట్టుకొన్నందుకు తాను అన్ని ప్రాణులకంటే ఉన్నతుడుగా రూపొందాలి. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్న నానుడిని సార్థకం చేయాలి. దుర్లభమైన మానవజన్మను పొంది పశుపక్ష్యాదులవలె, క్రిమికీటకాదులవలె జీవించరాదు. మీకు కుమారుడు కలిగినాడంటే మీరు పదిమందికి స్వీట్లు పంచుతారు. కుమారుడు పుట్టడంలో గొప్పతనమేమున్నది?! పందికి కూడా పది పిల్లలు పుడతాయి. అదేమైనా స్వీట్లు పంచిపెడుతుందా?! మీరు మొట్టమొదట మీలో ఉన్న సంకుచిత భావాలను, అల్పబుద్ధులను విసర్జించాలి. పవిత్రమైన భావాలను పెంచుకోవాలి; ఆదర్శవంతమైన ఆనందమయమైన జీవితాన్ని అందించాలి. అప్పుడే మీ మానవ జన్మ ధన్యమవుతుంది.

ప్రేమస్వరూపులారా! మీరు ప్రేమనే ధరించాలి. ఎట్టి కష్టములు వచ్చినా ప్రేమతోనే వాటిని భరించాలి. కష్టములు వచ్చినా, నష్టములు వచ్చినా ప్రేమతోనే వాటిని అందుకోవాలి. మహాభక్తురాలైన మీరాను హతమార్చే ఉద్దేశ్యంతో ఆమెకు పాలలో విషం కలిపి ఇచ్చారు. ఆమె దానిని అందుకొని 'కృష్ణార్పణం' అన్నది. కృష్ణుడు ఆ పాలలో ఉన్న విషమును తాను స్వీకరించి, ఆమెకు పవిత్రమైన క్షీరాన్ని ప్రసాదంగా అందించాడు. ఆమె పూజించే తెల్లని కృష్ణ విగ్రహం నీలంగా మారిపోయింది. అసలు కృష్ణుడు నీలవర్ణంతో పుట్టలేదు. నిజంగా కృష్ణుడే గనుక నీలవర్ణంతో పుట్టి ఉంటే అప్పుడే అతనిని తీసుకుపోయి 'ఎగ్జిబిషన్'లో పెట్టియుందురు! నీలవర్ణంతో ఎవ్వరూ పుట్టరు. భగవత్తత్త్వము ఆకాశమువలె అనంతమైనది, సముద్రమువలె అగాధమైనది. ఆకాశము, సముద్రము రెండూ నీలవర్ణముతో కూడినవి. కనుకనే, కృష్ణునికి నీలవర్ణము ఆపాదించబడింది. మీరు మీ హృదయంలో ప్రేమతత్త్వాన్ని పెంచుకోండి; దుర్గుణాలనే విషతత్త్వాన్ని విసర్జించండి. *(భగవాన్ 'ప్రేమ ముదిత మనసె కహో రామ రామ రామ్...' అనే భజన కీర్తన గానం చేసి, అనంతరం తమ దివ్యోపన్యాసమును కొనసాగిస్తూ ఇలా అన్నారు)*

sri sathyasai vachanamrutam

**మీ ప్రేమయే మిమ్మల్ని రక్షిస్తుంది, మీ దుర్భావములే మిమ్మల్ని శిక్షిస్తాయి**

'రామ, రామ, రామ' అంటే 'ప్రేమ, ప్రేమ, ప్రేమ' అని అర్థము. ప్రేమతత్త్వమే రామతత్త్వము. ఆత్మ తత్త్వమే రామతత్త్వము. కొంతమందికి 'రామ' అంటే ప్రీతి. కొంతమందికి 'కృష్ణ' అంటే ప్రీతి. కొందరికి 'సాయి' అంటే ప్రీతి. ఈ రూపనామములన్నింటిలో అంతర్భూతంగా ఉన్న దివ్యశక్తికే 'ఆత్మ' అని పేరు పెట్టారు. ఆత్మతత్త్వమునకు ఒక ప్రత్యేకమైన రూపము లేదు, నామము లేదు. ఆత్మకే 'బ్రహ్మ' అని పేరు. 'బ్రహ్మ సత్యం జగన్మిథ్య.' బ్రహ్మతత్త్వం ద్వంద్వాతీతం, త్రిగుణరహితం. బ్రహ్మకు ఎట్టి గుణములూ లేవు. ఒకరిని రక్షించేదీ, శిక్షించేదీ బ్రహ్మ కానే కాదు. మీ హృదయములో నిండియున్నటువంటి నిర్మల, నిశ్చల, నిస్వార్థ ప్రేమతత్త్వమే మిమ్మల్ని రక్షిస్తుంది. మీలో ఉన్న దుర్భావములే మిమ్మల్ని శిక్షిస్తాయి. కాబట్టి, ప్రేమ నొక్కదానిని పెంచుకోండి, చాలు. సర్వవేళల అదే మిమ్మల్ని సంరక్షిస్తుంది. ప్రేమకు మించినటువంటి రక్షణ ఈ ప్రపంచంలో మరొకటి లేనే లేదు. ద్వేషాన్ని మించినటువంటి శత్రువు మరొకటి లేదు. 'ప్రేమ' అనే పదములోనే ఉన్నది ఎంతో మాధుర్యము. కనుక, మీ పలుకులను ప్రేమతో నింపండి. ప్రేమతోనే మీ జీవితాన్ని ఆనందంగా గడపండి.

**(2006 మే 27, కర్ణాటక యువజన సమ్మేళనము, బృందావనం)**

sri sathyasai vachanamrutam